ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 17 ఫిబ్రవరి 2025



చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	190	210
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5 । కనిష్ఠం 19.0

పెద్దగట్టుకు చేరిన దేవరపెట్టె

ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో.. భేరీల చప్పుడు, కటారీ విన్యాసాల నడుమ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతర సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్ధరాత్రి అట్టహాసంగా ప్రారంభమైంది. గంపలు, బోనాలు తలపై పెట్టుకొని కటారీలు చేతపట్టి, భేరీలు మోగిస్తూ కాళ్లకు గజ్జెలు కట్టి నృత్యాలు చేస్తూ యాదవులు లింగమంతుల స్వామిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. ఓ లింగా.. ఓ లింగా నామస్మరణం చేస్తూ గుడి చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. ఉదయం సమయం నుంచే భక్తులు లింగమంతుల స్వామి, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, సౌడమ్మ దేవతలను దర్శించుకున్నారు. కేసారం గ్రామంలో దేవరపెట్టెకు మున్న, గొర్ల, మెంతబోయిన కులస్థులు పూజలు చేసి పెద్దగట్టుకు ఆదివారం రాత్రి తరలించారు. దీంతో జాతర ప్రారంభమైంది. కేసారంలో జరిగిన పూజల్లో పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ●6లో..



ప్రజా సమస్యలను పరిష్కరించడంలోనే సంతృప్తి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్ ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడు కలిగే సంతృప్తి మరెందులోనూ ఉండదని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతులు తీసుకొని కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుందన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల ముందు కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డును కమీషన్ కోసం విక్రయించారని విమర్శించారు. రూ.30వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేశారని అన్నారు. దశాబ్దాల నల్గొండ జిల్లా సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శ్రీశైలం టన్నెల్ బేరింగ్ మిషన్ పనులు ప్రారంభమయ్యాయని, అమెరికా నుంచి రాబిన్స్ బోరింగ్ కంపెనీ నుంచి మరో బేరింగ్ మిషన్ చెన్నై పోర్టు వరకు వచ్చిందన్నారు. రెండేళ్లలో శ్రీశైలం సొరంగం మార్గం పనులను పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలం టన్నెల్, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించామన్నారు. నల్లగొండ సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దానని పేర్కొన్నారు. ఇప్పటికే పట్టణంతో పాటు నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, అవన్నీ పూర్తయి త్వరలో నల్లగొండ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం అనుప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పాల్గొన్నారు.

'డయల్ యువర్ సైబర్ నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా సైబర్ క్రైమ్ సంబంధించిన సమస్యలు, సందేహాలను తెలుసుకునేందుకు డయల్ యువర్ సైబర్ నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితుల సమస్యల పరిష్కార మార్గాలను తెలుసుకునేందుకు 8712658079 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఛాయా రహస్యం.. సోమేశ్వరాలయం



పానగల్ సమీపంలోని ఛాయా సోమేశ్వరాలయం ●7లో..

ఆస్తి పన్ను వసూలు అంతంతే!



» హాలియా మునిసిపాలిటీలో 0.5శాతమే వసూలు
» నల్లగొండ మునిసిపాలిటీలోనూ 18.5శాతమే » ముంచుకొస్తున్న గడువు

రామగిరి, మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులు చెల్లించే పన్నులే మునిసిపాలిటీకి ప్రధాన వనరు. ఆస్తిపన్ను, భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు, నల్లా చార్జీలు, ట్రేడ్ లైసెన్స్, మునిసిపల్ ఆస్తుల అద్దెలు తదితర రూపాల్లో మునిసిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. వీటిలో ఆస్తి పన్నుదే ప్రధాన వాటా. నిర్మాణ అనుమతుల పేరుతో ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుండగా, ఆస్తి పన్నును మాత్రం ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి వందశాతం వసూలు లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగాలు కృషి చేస్తుంటా యి. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం మరో 40 రోజుల్లో ముగియనుండగా, జిల్లాలోని నల్లగొండ మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూలు అంతంత మాత్రంగానే ఉంది. నల్లగొండలో 18.5 శాతం, హాలియాలో అత్యల్పంగా 0.5శాతం, దేవరకొండలో 53.39శాతం, మిర్యాలగూడలో 63.90 శాతం ఆస్తి పన్ను వసూలైంది.

నల్లగొండలో 48వార్డులకు 36,150 నివాస గృహాలు ఉండగా 3,481 కమర్షియల్ గృహాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.16.62కోట్ల ఆస్తిపన్ను రావాల్సి ఉంది. పాత బకాయిలు రూ.14.91కోట్ల పైచిలుకు ఉంది. అపరాధ రుసుము కలిపి రూ.48.41కోట్ల బకాయి ఉంది. అయితే ఇప్పటి వరకు సుమారు రూ.12 కోట్లు వసూలు కాగా, రూ.37కోట్ల పైచిలుకు అద్దె రూపంలో రావాల్సి ఉంది. దీంతో పట్టణంలో రూ.50వేలకు పైబడి ఉన్న 600 మంది బకాయిదారులకు 10 రోజుల క్రితం మునిసిపల్ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం రెడ్ నోటీసులు అందుకున్న వారం రోజుల్లో స్పందించాల్సి ఉంటుంది. అందులో కొంతమంది బకాయిలు చెల్లించగా, మరికొంతమంది నిర్లక్ష్యాన్ని వీడకపోవడంతో వారి ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయల బకాయి రూ.13కోట్లకు పైగా

నల్లగొండ పట్టణంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 96 కార్యాలయాలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 300 కార్యాలయాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.88.5కోట్ల పన్ను రావాల్సి ఉండగా, రూ.4కోట్ల పైచిలుకు మాత్రమే వసూలయ్యాయి. సుమారు రూ.13కోట్ల పైచిలుకు వసూలవ్వాల్సి ఉంది. మొత్తంగా వివిధ గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు కలిపి రూ.50కోట్లకు పైగా రావాల్సి ఉంది.

వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక బృందాల ఏర్పాటు

మార్చి చివరి నాటికి వందశాతం వసూలు చేయాలన్న లక్ష్యంతో మునిసిపల్ అధికారులు ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఏడు నుంచి ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. గతంలో 48 వార్డులకు 10మంది బిల్ కలెక్టర్‌లు మాత్రమే ఆస్తి పన్నులను వసూలు చేసేవారు. ఇటీవల కొత్తగా 40మంది వార్డు ఆఫీసర్లు నియమితులయ్యారు. ఇప్పుడున్న పది మందితో పాటు ఈ వార్డు ఆఫీసర్లు ప్రతీ ఇంటిని తిరిగి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు.

బకాయిలు పేరుకుపోయేందుకు కారణాలెన్నో..

పన్ను బకాయిలు పేరుకుపోయేందుకు కారణాలెన్నో ఉన్నాయి. సకాలంలో పన్ను చెల్లించకున్నా చర్యలేమీ మిగతా 8వ పేజీలో...

ఆదాయం లేని నందికొండ

నూతనంగా ఏర్పాటైన నందికొండ(నాగార్జునసాగర్) మునిసిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఇక్కడ అన్నీ ప్రభుత్వ కార్యాలయాలే ఉండటం, పర్యాటక ప్రాంతం కావడంతో ప్రైవేట్ ఆస్తులు లేవు. ఇక్కడి భవనాలన్నీ ప్రభుత్వానికి చెందినవే ఉన్నాయి. నందికొండ మునిసిపల్ ఆఫీస్‌ను సాగర్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీలో 36 మంది పారిశుధ్య కార్మికులను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించగా, పురపాలికకు ఆదాయమే లేకపోవడంతో కలెక్టర్ స్పెషల్ ఫండ్ నుంచి వారికి వేతనాలు చెల్లిస్తున్నారు.

మునిసిపాలిటీ	ఆస్తులు	డిమాండ్ (రూ.కోట్లలో)	బకాయిలు (రూ.కోట్లలో)	వసూలు (రూ.కోట్లలో)
నల్లగొండ	4,42,474	6162.44	5016.52	1145.92
మిర్యాలగూడ	25,695	883.30	646.86	564.47
హాలియా	5,621	204.01	68.70	1.03
దేవరకొండ	7,062	288.44	37.31	154.01

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

» సంస్థాగత నిర్మాణంపై టీడీపీ దృష్టి
» స్థానిక ఎన్నికలకు సమాయత్తం

నల్లగొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ వర్గాలు దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును చేపట్టి కార్యకర్తల్లో నూతనోత్సాహం తీసుకొచ్చింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 24,720 సభ్యత్వాలను చేపట్టారు. పార్టీ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ సభ్యత్వాన్ని తీసుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడం కోసం కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అంతేకాక గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గత కమిటీలన్నింటినీ రద్దు చేసిన అనంతరం పార్లమెంట్ అడహక్ కమిటీని వేసి అందులో అన్ని నియోజకవర్గాలకు చెందిన నేతలకు ప్రాతినిధ్యం కల్పించారు. అడహక్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వ నమోదు పారదర్శకంగా ఉండటం కోసం ఆన్‌లైన్ విధానాన్ని చేపట్టడంతో గతంలో ఉన్న సభ్యత్వాలను రెన్యూవల్ చేయడంతో పాటు కొత్త సభ్యత్వాలను సేకరించారు. ఏపీ సీఎం చంద్రబాబు సమయం దొరికినప్పుడల్లా తెలంగాణకు వచ్చినప్పుడు తప్పనిసరిగా ఎన్టీఆర్ భవన్‌కు చేరుకొని అన్ని జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో భేటీ అవుతూ వస్తుండటంతో ఉత్సాహం నెలకొంటూ వస్తుంది. అదే విధంగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తరచుగా నాయకులు, కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి సీఎం చంద్రబాబుతో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేష్‌ను కూడా కలిసి పార్టీ బలోపేతం కోసం తీసుకుంటున్న కార్యాచరణపై వివరిస్తూ వస్తున్నారు. ఇకపోతే త్వరలోనే గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కమిటీలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ఆ పార్టీ యోచిస్తోంది. ఈ సందర్భంగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేలా పార్టీ ప్రణాళికలు రూపొందిస్తోంది. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మొత్తానికి జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టిన తమ్ముళ్లు సమరోత్సాహంతో ఉన్నారు.

'గురుకుల' ఘటనపై కొనసాగుతున్న విచారణ

● పాఠశాలను సందర్శించిన సీఐ ●7లో..

సాగర్ అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

మిర్యాలగూడలో ఐసీఎస్ఎస్ఆర్ జాతీయ సదస్సు

వేదిక కానున్న కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోదండరాం, వీసీ అల్తాఫ్‌హుస్సేన్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలను ప్రోత్సహించే జాతీయ సంస్థ అయిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు మార్చి 17, 18వ తేదీల్లో పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనుంది.

తొలిసారిగా ఎంపికైన చదువుల కోవెల

ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సంస్థ ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా సెమినార్లు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. నోటిఫికేషన్‌కు అనుగుణంగా దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు అందుతాయి. అయితే పరిశోధన విభాగంలో ఉత్తమ ప్రాజెక్టు పంపిన కళాశాలలను ఎంపిక చేసి జాతీయస్థాయి సదస్సు నిర్వహించడంతో పాటు సెమినార్ నిర్వహణకు ఆర్థిక సాయం అందిస్తుంది. ఐసీఎస్ఎస్ఆర్‌లో భాగంగా అర్థశాస్త్ర విభాగంలో కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొలిసారిగా ఎంపిక కావడం విశేషం.

కళాశాల చరిత్ర గొప్పదే..

పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 1981లో స్థాపించారు. ఎందరో విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు చేర్చిన కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని నింపి, సైనికుల్లాగా తీర్చిదిద్దే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో ఈ విద్యాలయం పలు ప్రశంసలు పొందింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడావిభాగం కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాలను ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఇక గతేడాది ఢిల్లీలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనేందుకు కేఎన్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవకాశం ఇవ్వడం గమనార్హం.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలతో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాతీయస్థాయి సెమినార్‌లో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలతో కూడిన ప్రజంటేషన్లు ఉంటాయి. గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ప్రాస్పెక్ట్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై నిర్వహించనున్న సెమినార్‌లో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించు పలు పరిశోధనాత్మక అంశాలతో కూడిన ప్రెజంటేషన్లు ఇవ్వనున్నారు. ఐటీ, ఐ-పాస్, ఫైనాన్షియల్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్, జీఎస్‌డీపీ, ట్రాన్స్‌పోర్ట్ అంశాలపై చర్చ నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు.

సెమినార్‌కు ఎంపిక గొప్ప విషయం



గ్రామీణ నేపథ్యం ఉన్న కళాశాల జాతీయస్థాయి సెమినార్‌కు ఎంపికవడం ఆనందంగా ఉంది. ఆర్థిక ప్ర గతికి మూలమైన అర్థశాస్త్రంలో సెమినార్ నిర్వహించడం గొప్ప విషయం. కళాశాల స్థాపించి నాలుగు దశాబ్దాల కాలంలో తొలిసారిగా జాతీయస్థాయి సెమినార్‌కు ఎంపికైంది. కళాశాల అర్థశాస్త్ర విభాగానికి కృతజ్ఞతలు.

డాక్టర్ సముద్రాల ఉపేందర్, ప్రిన్సిపాల్,
కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పెద్దగట్టుకు చేరిన దేవరపెట్టె



పెద్దగట్టు ఆలయం, లింగమంతుల స్వామి, సౌడమ్మల దేవతలు

ఆంధ్రజ్యోతి ఓ లింగ ఓ లింగా Feb 16-20

ఓ లింగా.. ఓ లింగా అంటూ నామస్మరణలు, భేరీ చప్పుళ్లు, కఠారీ విన్యాసాల నడుమ సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి శ్రీ లింగ మంతులస్వామి(పెద్దగట్టు) జాతర ఆదివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదివారం రాత్రి సూర్యాపేట మండలంలోని కేసారం నుండి ఆచారం ప్రకారం దేవరపెట్టెను భక్తిశ్రద్ధలతో పెద్దగట్టుకు పోలీస్ బందోబస్తు నడుమ తరలించారు. భక్తులతో పెద్దగట్టు పరిసర ప్రాంతాలు కిక్కిరిసాయి.

(ఆంధ్రజ్యోతి- సూర్యాపేట(కలెక్టరేట్)

పెద్దగట్టుకు ఆదివారం ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. సూర్యాపేట జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాల భక్తులు లింగమంతులస్వామి, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, సౌడమ్మ దేవతలను దర్శించుకున్నారు. గంపలు, బోనాలు తలపై పెట్టుకొని గజ్జెలు కట్టి నృత్యాలు చేస్తూ బోనాలు సమర్పించారు. గుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. కోనేరులో భక్తులు స్నానాలు ఆచరిస్తున్నారు. సారలమ్మకు, నాగదేవతకు, ఎల్లమ్మతల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది భక్తులు ఆదివారం మధ్యాహ్నానికే పెద్దగట్టుకు చేరుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కొంతమంది భక్తులు ఆదివారం ఉదయం నుండే లింగమంతులస్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. భక్తుల సంఖ్య సాయంత్రానికి మరింతగా పెరిగింది.

పెద్దగట్టుకు చేరిన పసిడికుండ

పెద్దగట్టు శ్రీ లింగమంతులస్వామి జాతర ప్రారంభం రోజు సాంప్రదాయ బద్ధంగా ఆదివారం మధ్యాహ్నం సమీప గ్రామమైన ఖాసీంపేట నుంచి పసిడి కుండను సాంప్రదాయ చప్పుళ్ల మధ్య పెద్దగట్టుకు చేర్చారు. అనంతరం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


బోనం ఎత్తుకుని వస్తున్న మహిళలు

అర్ధరాత్రికి జనసంద్రం

జాతర ప్రాంతమంతా ఆదివారం అర్ధరాత్రి 12గంటలకు జనసంద్రమైంది. చీమల దండులా వాహనాలు ఒకదాని వెనుక ఒకటి జాతరకు బయలుదేరాయి. ఓ లింగా, ఓ లింగా నామస్మరణలతో జాతర ప్రాంతం మారుమ్రోగిపోయింది. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో తరలివచ్చారు. 65వ జాతీయ రహదారిపై సూర్యాపేట నుంచి మూడు కిలోమీటర్ల దాకా భక్తుల వాహనాలే కనిపించాయి. పోలీస్ సిబ్బంది అడుగడుగునా ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా సూచించిన ప్రకారం ప్రాంతాలను బట్టి వాహనాలను ఆయా పార్కింగ్ ప్రదేశాలకు తరలించారు.


ఆలయం వద్ద డప్పు చప్పుళ్ల మధ్య కఠారీతో భక్తుడి నృత్యం


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

నేడు పెద్దగట్టుకు మంత్రి ఉత్తమ్

లింగమంతులస్వామిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం దర్శించుకోనున్నారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి 8 గంటలకు దురాజ్‌పల్లికి చేరుకుంటారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం మంత్రి తిరిగి హైదరాబాద్‌కు వెళతారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు.

గుడి చుట్టూ ప్రదక్షిణ

ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత భక్తులు గంపలను నెత్తిపై పెట్టుకొని కాళ్లకు గజ్జెలు కట్టుకొని గొర్రెలకు అలంకరణ చేసి లింగమంతుల స్వామి గుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. కుటుంబ సభ్యులంతా ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం గుట్టపైన జంతు బలులు జరిగాయి. సోమవారం ఆరు లక్షలకు పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

● జాతరలో నేడు

నేడు తెల్లవారుజాము నుంచి గుట్ట వద్ద భక్తులు పసుసు, కుంకుమతో బోనాన్ని అలంకరించుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి దేవుళ్లకు బోనాలు సమర్పిస్తారు. బోనాల సమర్పణ సందర్భంగా ఆలయం కిటకిటలాడనుంది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా. ఇందుకు తగ్గట్టుగా అధికారులు, దేవాలయ సమన్వయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

కేసారం నుంచి తరలించిన దేవరపెట్టె



నేడు ఉమ్మడి జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు

పెద్దగట్టు జాతర సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు జాతర సందర్భంగా లోకల్ హాలిడేగా అమలు చేయాలని ఆదేశించారు.

గుడి చుట్టూ టెంట్లు

దేవస్థానం గుడి చుట్టూ కింది భాగంలో ఎక్కడ స్థలం ఉంటే అక్కడ లారీలు, ట్రాక్టరల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు టెంట్లు వేసుకున్నారు. జంతు బలులు జరిగిన తర్వాత అక్కడే వంటావార్పు చేసుకున్నారు. తెల్లవారుజామునుండే మొక్కులు చెల్లించారు. అనంతరం వంటలు వండుకోవడం ప్రారంభించారు.

వాహనాల మళ్లింపు

నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్ నగర్, కోదాడ దారిలో రాకపోకలు

కోదాడ, నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో హైదరాబాద్-విజయవాడ రహదారికి ఆనుకుని పెద్దగట్టు జాతర సందర్భంగా హైవేపై వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలను సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం నుంచి మళ్లింపు చర్యలు చేపట్టారు. కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించి, వయా హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపుతున్నారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను అదే రూటులో వచ్చేలా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపైకి మళ్లిస్తున్నారు. అక్కడి నుంచి నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ మీదుగా కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ నుంచి విజయవాడకు మళ్లిస్తున్నారు. కోదాడలో డీఎస్పీ ఎం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రాము ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. జాతర నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు బోర్డులను ఏర్పాటుచేశారు. ట్రాఫిక్ మళ్లింపుతో హుజూర్‌నగర్ నుంచి నార్కట్‌పల్లి వరకు ఉన్న రహదారిపై వాహనాలతో రద్దీ నెలకొంది. నార్కట్‌పల్లి వద్ద సుమారు 70 మంది పోలీసు సిబ్బందితో వాహనాల దారి మళ్లింపును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అనుమతి ఉన్న వాహనాలకే అవకాశం

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి మార్గంలో వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. జాతర ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో వచ్చే అన్ని ప్రాంతాలల్లో బారికేడ్లతో పాటు భారీబందోబస్తు ఏర్పాటుచేసి అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే జాతర ప్రాంతానికి అనుమతిస్తున్నారు. జాతరకు వచ్చే వాహనాలను జాతర సమీప పరిసరాల వరకు అనుమతించి పార్కింగ్ ప్రదేశాలకు పంపిస్తున్నారు. దురాజ్‌పల్లి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి ఖాసీంపేట క్రాస్‌రోడ్డు వరకు వన్‌వే ఏర్పాటుచేసి ఎలాంటి వాహనాలను అనుమతించలేదు. కేవలం పాదాచారులు మాత్రమే జాతరకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.



పెద్దగట్టు వద్ద పర్యటిస్తున్న జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, కోదాడ వైపు ఒకే దారిలోకి వాహనాల దారి మళ్లింపు



కోదాడలో హుజూర్‌నగర్ దారిలోకి.. నార్కట్‌పల్లిలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపైకి వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి

దేవరకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం టీ పాత్లావత్‌తండాలో మద్యం మత్తులో ఓ యువకుడిపై కత్తితో దాడి జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం టీ.పాత్లావత్‌తండాకు చెందిన కొర్ర శరత్ ఇంటి సమీపంలో ఉంటున్న సేవ అనే యువకుడు రెండు, మూడుసార్లు ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న శరత్ ఇంటి చుట్టూ ఎందుకు తిరుగుతున్నావని ఆగ్రహంతో కత్తితో సేవపై వెనుక నుంచి దాడిచేశాడు. దీంతో సేవకు తీవ్రగాయాలు కాగా స్థానికులు వాహనంలో దేవరకొండ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు సీఐ తెలిపారు. బాధితుడు సేవ ఫిర్యాదు మేరకు శరత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

బేతవోలులో రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు


బేతవోలులో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

చిలుకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఆదివారం దేవాలయ పునఃనిర్మాణ కార్యక్రమం వద్ద ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బేతవోలు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం దేవాలయ పునఃనిర్మాణ శంకుస్థాపన సమయంలో వాగ్వాదం మొదలైంది. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన మాజీ సర్పంచ్ చంద్రకళ భర్త వట్టికూటి నాగయ్య వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో నాగయ్యను ప్రత్యర్థి వర్గం దూషించటం, ఘర్షణ విషయం బయటవున్న వారికి తెలియటంతో ఒక్కసారిగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ మొదలై ఒక్కరిపై ఒక్కరు రాళ్లు విసురుకున్నారు. దీంతో పలువురికి గాయాలు కాగా వట్టికూటి నాగయ్య వర్గానికి చెందిన వెంకటనర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఘర్షణ విషయం తెలిసిన వెంటనే కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు, కోదాడ, కోదాడరూరల్ ఎస్ఐలు రాంబాబు, రంజిత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. అనంతరం ఇరువర్గాలను చెల్లాచెదురు చేసి గ్రామంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో పికెటింగ్ ఏర్పాటుచేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరికి గాయాలు

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను అతి వేగంతో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తల్లీకుమారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం అనాజీపురం శివారులో ఆదివారం జరిగింది. రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం పెద్దతండాకు చెందిన తేజావత్ లింగమ్మ, అతడి కుమారుడు వరుణ్ బీబీనగర్ మండలం జంపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో అనాజీపురం వద్ద నల్లగొండ నుంచి భువనగిరికి వెళ్తున్న నార్కట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో లింగమ్మ, వరుణ్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు.


ప్రమాదానికి కారణమైన బస్సు

బర్డ్‌ఫ్లూ భయం.. చికెన్‌కు దూరం

● చేపలు, మటన్‌వైపు మళ్లుతున్న మాంసం ప్రియులు ● విక్రయాలు లేక చికెన్ దుకాణాలు వెలవెల


నల్లగొండలో విక్రయాలు లేక ఖాళీగా కూర్చున్న చికెన్ షాపు నిర్వాహకులు

దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందన్న భయంతో చికెన్ తినలేక.. చేపలు, మటన్ వైపు మాంసం ప్రియులు మళ్లుతున్నారు. కోళ్ల ఫారాలలోని కోళ్లు మృతి చెందుతుండడం, బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందని ప్రచారం జరుగుతుండడంతో చికెన్ విక్రయాలు తగ్గాయి. ఆదివారం కావడంతో మాంసం ప్రియులు చికెన్‌కు బదులుగా చేపలు, మాంసం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. దేవరకొండ డివిజన్‌లో చేపలు, మటన్ విక్రయాలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. దేవరకొండ పట్టణంలోని ఓ చికెన్ షాపులో రోజువారిగా క్వింటాల్‌కుపైగా చికెన్ విక్రయాలు జరుగుతుండేవి. ఆదివారం రెండు క్వింటాళ్ల వరకు విక్రయించేవారు. కాని ఈ వారం 50 కేజీలు కూడా విక్రయించలేదని చికెన్ వ్యాపారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణంలోని మాంసం వ్యాపారి ఆదివారం కావడంతో ఉదయం 8గంటలకు మేక మాంసం మార్కెట్‌కు తీసుకురాగా గంట వ్యవధిలోనే పూర్తిగా విక్రయాలు జరిగాయని మార్కెట్‌లో మటన్‌కు డిమాండ్ పెరిగిందని తెలిపారు. దేవరకొండతోపాటు కొండమల్లేపల్లి, పీఏపల్లి, పోలేపల్లి, అంగడిపేట, డిండి, చింతపల్లి, మాల్‌లలో చేపల విక్రయాలు పెరిగాయి. మేక మాంసం కేజీ రూ. 800 కాగా, చేపలు రూ.150 నుంచి 200 వరకు మార్కెట్‌లో వి క్రయి స్తున్నారు. దేవరకొండలో రోడ్లపైనే చేపలు, మటన్ విక్రయాలు జరుపుతుండడంతో దుమ్ము, దూళి పడుతోందని ప్రజలు వాపోతున్నారు.


నల్లగొండలో మటన్ షాపు వద్ద గిరాకీ


దేవరకొండలో చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

ప్రారంభానికి నోచుకోని వినోబాభావే మందిరం

యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో భూదానోద్యమ చారిత్రక నేపథ్యానికి స్మృతిచిహ్నంగా నిర్మించిన 'వినోబామందిరం' నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 18 ఏప్రిల్ 1951న ఆచార్య వినోబాభావే స్ఫూర్తితో ప్రథమ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి త్యాగనిరతితో భూదానోద్యమానికి బీజం పడింది. 2012లో ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి సెప్టెంబరు 11న భూదానోద్యమ స్మృతి చిహ్నం వినోబామందిరం నిర్మాణానికి రూ.50లక్షలు నిధులు మంజూరుచేశారు. వినోబా మందిరం నిర్మించి దశాబ్దం దాటినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

దేశ చరిత్రలోనే 1951 ఏప్రిల్ 18వ తేదీ సువర్ణాక్షరాలతో లిఖించతగిన రోజు. గాంధీజీ ప్రియశిష్యుడిగా గాంధీజీ ఆశయాలు, సర్వోదయ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి ఆచార్య వినోబాభావే పౌనార్ ఆశ్రమాన్ని వీడి దేశమంతటా 11 మంది శిష్యబృందంతో కలిసి పాదయాత్రకు సిద్ధమయ్యారు. అదే సమయంలో సర్వోదయ నాయకుడు శ్రీ రామకృష్ణ దూత్ ఆహ్వానం మేరకు 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్ సమీపంలోని శివరాంపల్లిలో నిర్వహించిన సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. ఆ తరుణంలోనే తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న సంఘటనలు, ఖాసీం రిజ్వీ సైన్యం అరాచకాలు, ఆగడాలు తీవ్రంగా కలచివేశాయి. నాటి పరిస్థితులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడంపై చలించిన ఆయన ఈ సమస్యకు పరిష్కారం వెతకాలనే దృఢ సంకల్పంతో పాదయాత్ర ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సందర్శించారు. శాంతియాత్ర కోసం పోచంపల్లికి చేరుకున్న ఆచార్య వినోబాభావేకు అశేష జనవాహని స్వాగతం పలికింది. దళితవాడ సమీపంలోని చెరువుకట్ట వద్ద దళితులతో సమావేశమైన ఆయన వారి యోగక్షేమాలు అడిగే క్రమంలో భూమిస్తే, సాగుచేసుకుని జీవిస్తాం అనే మాట వినబడింది. ఆ ఒక్క మాట మహా ఉద్యమానికి తెరలేపింది. అదేరోజు సాయంకాలం వినోబాజీ భూస్వాములు ఎవరైనా ముందుకు వచ్చి భూమి ఇవ్వగలరా? అని కోరారు. వెంటనే వెదిరె రామచంద్రారెడ్డి అనే భూస్వామి సేద్యయోగ్యమైన 100 ఎకరాల భూమిని దానంగా ఇస్తానని ప్రకటించారు. అదే నిండు సభలో దానరూపేణా లభించిన భూమిని వినోబాభావే దళితులకు పంచి భూదానోద్యమానికి అంకురార్పణ చేశారు. అప్పటి నుంచి పోచంపల్లి తన పేరును 'భూదాన్'పోచంపల్లిగా మార్చుకుంది. యాధృచ్ఛికంగా జరిగిన ఈ ఘటన భూదానోద్యమానికి ఊపిరిపోసి ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.


పోచంపల్లిలోని వినోబాభావే మందిరం

పోచంపల్లికి మూడుసార్లు ..

ఆచార్యవినోబాభావే పోచంపల్లిలో మూడు సార్లు పర్యటించారు. దేశవ్యాప్తంగా ఆయన 1.70 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. అలాగే రెండోసారి ఉమ్మడి రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి 1955 డిసెంబరులో పాదయాత్ర ప్రారంభించి 1956లో గాంధీ వర్ధంతి రోజున జనవరి 30న పోచంపల్లికి చేరుకున్నారు. సేకరించిన 1.70 లక్షల ఎకరాల్లో 1.26 లక్షల ఎకరాల భూమికి మాత్రమే చట్టబద్ధత కలిగి ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సైతం వేల ఎకరాల భూమిని భూమిలేని నిరుపేదలకు ఆనాడు పంచిపెట్టారు.

అదే స్ఫూర్తితో 80 వేల కిలోమీటర్లు, 40లక్షల ఎకరాలు

భూదానోద్యమ స్ఫూర్తితో భూదాన ఉద్యమం ఒక స్పష్టమైన కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమం వేలాది కార్యకర్తలను ఆకర్షించింది. 1970 వరకు 80 వేల కిలోమీటర్ల పాదయాత్రతో దాదాపు 40 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. వివిధ రాష్ట్రాల్లో లక్షల ఎకరాల భూమిని భూస్వాముల నుంచి సేకరించి భూమిలేని పేదలకు పంచారు. నేటికీ ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇలా భూదానోద్యమానికి అంకురార్పణ జరిగిన పోచంపల్లిని 'భూదాన గంగోత్రి'గా అభివర్ణిస్తూ తన రెండో జన్మస్థలంగా వినోబాభావే పేర్కొన్నారు. 1976లో పోచంపల్లికి మూడోసారి సందర్శించిన వినోబాభావే అప్పటి పరిస్థితులపై ఆరా తీశారు. జలగం వెంగళరావు సీఎంగా ఉన్నప్పుడు ఆయన పోచంపల్లి సందర్శించి వినోబాభావేతో సమావేశమై ఆయన కోరిన విధంగా పోచంపల్లిలో పీర్ల కొట్టాన్ని 'వినోబా మందిరం'గా నిర్మించారు. ఇక్కడ వినోబా మందిరంగా నేటికీ ప్రసిద్ధి చెందింది.

సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి 2012లో సెప్టెంబరు 11న భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. భూదానోద్యమ స్మృతిచిహ్నమైన వినోబామందిరం శిథిలమైందని భూదాన్ బోర్డు ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, ఆనాటి ప్రముఖ కాంగ్రెస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కోరిక మేరకు వినోబామందిరం పునర్నిర్మాణానికి రూ.50లక్షలు నిధులు మంజూరు చేశారు. మందిరం నిర్మించిన అనంతరం ప్రభుత్వం దీనిని ఇబ్రహీంపట్నంలోని వినోబా డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ(వీడీఎస్ఎస్)కి అప్పగించింది. అయితే నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. వినోబామందిరం నిర్వహణ బాధ్యత రాష్ట్ర భూదాన్‌యజ్ఞ బోర్డు ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వినోబా మందిరాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వినోబా మందిరాన్ని ప్రారంభించాలి



యునెస్కో గుర్తింపుతో భూదాన్‌పోచంపల్లి నేడు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. భూదాన్ గంగోత్రిగా ఖండాంతర ఖ్యాతి చెందిన ఈ ప్రాంతంలోని భూదానోద్యమ స్మృతి చిహ్నమైన వినోబా మందిరాన్ని ప్రారంభించాలి. 12ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిర్మించిన వినోబా మందిరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించాలని కోరుతున్నాం.

ఏలె భిక్షపతి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర నాయకులు, భూదాన్‌పోచంపల్లి

ఛాయా రహస్యం.. సోమేశ్వరాలయం

● అద్భుత శిల్పకళా నిలయం పానగల్ సోమేశ్వరాలయం ● వేదఘోషతో అలరారిన ప్రాంతం ● రాజసం ఉట్టిపడేలా నాటి అద్భుత కట్టడం ● ఆలయాన్ని సందర్శిస్తున్న దేశ, విదేశీ పర్యాటకులు



నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్‌లో ఉన్న ఛాయా సోమేశ్వరాలయం

నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలోని పానగల్ ప్రాంతంలోని ఛాయాసోమేశ్వరాలయం ఎన్నో విశేషాల సమాహారం. నిరంతర ఏకా నిశ్చలాకార నీడ గర్భగుడిలో కనిపించడం ఈ ఆలయ విశిష్టత. సూర్యుడి గమనంలో మార్పు ఉన్నా కూడా ఆ నీడ మారదు. తూర్పు ముఖంగా ఉన్న గర్భగృహం మధ్య నిరంతరం కదలకుండా ఉండే ఛాయను ఈ ఆలయంలో చూడవచ్చు. శివలింగంపై ఈ ఛాయ కప్పబడి ఉంటుంది. ఈ ఛాయ కారణంగా ఈ దేవాలయానికి ఛాయ సోమేశ్వరస్వామి దేవాలయంగా పేరొచ్చింది. ఈ ఆలయం 11, 12వ శతాబ్దం నాటిదిగా పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఛాయాసోమేశ్వరాలయం కాకతీయుల కాలం నాటి శిల్పకళా సంపదకు నిలయంగా ఉంది. క్రీస్తుశకం 11, 12వ శతాబ్ధ కాలానికి చెందినదిగా పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతుంటారు. దేవాలయాన్ని కుందూరు చోళుల కాలంలో నిర్మించారు. ఇక్కడ లభించిన ఒక శాసనం క్రీస్తుశకం 1290లో కాకతీయ ప్రభుత్వం ప్రతాపరుద్రుడి పేరు మీద ఉంది. ఆలయాన్ని పూర్తిగా రాళ్లతో నిర్మించారు. పశ్చిమ చాళుక్యులు, కుందూరు చోళులు, కాకతీయుల కళా తృష్ణకు నిదర్శనంగా ఛాయసోమేశ్వర ఆలయం నిలిచింది. మధ్య యుగపు ఛాయలతో, శిల్ప కళా నైపుణ్యాన్ని ప్రతీకగా నల్ల రాతితో చెక్కిన శిల్ప కళాకృతులతో ఆలయం ఉంటుంది. భూకంపాల వంటి ఉపద్రవాలు వచ్చినా చెదరకుండా నిర్మించారు. ఆలయానికి ముందు ఉదయ సముద్రం అనే చెరువును నాటి రాజులు తవ్వించారు. ఇప్పటికీ దాని ద్వారానే తాగు, సాగు నీరు అందుతోంది. ఆలయానికి తూర్పు, పడమర, ఉత్తర దిశల్లో మూడు గర్భగుడులు ఉన్నాయి. ఈ గర్భగుడులు సైతం ఒకే నిర్మాణరీతిలో ఉన్నప్పటికీ కేవలం తూర్పువైపునకు ఉన్న గర్భగుడిలో మాత్రమే ఏక నిశ్చలఛాయ కనిపిస్తోంది. ఛాయా సోమేశ్వర ఆలయం వాస్తుశాస్త్ర పరంగా అద్భుతమని చరిత్రకారులు చెబుతుంటారు. ఛాయసోమేశ్వరాలయం త్రికూట ఆలయంగా కూడా ప్రసిద్ధి. గర్భగుడిలో శివలింగం మీదుగా నిరంతర ఏర్పడే ఛాయ ఏ వస్తువుదన్న విషయం నేటికీ అంతు చిక్కని రహస్యంగా ఉంది.

యునెస్కో గుర్తింపు కోసం

ఛాయసోమేశ్వర ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం గత ఆలయ అబివృద్ధి కమిటీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు ప్రాంతంలోని రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఆ ఆలయ మాదిరిగానే ఛాయాసోమేశ్వర ఆలయానికి కూడా అంతర్జాతీయ ఖ్యాతి లభించడం కోసం కృషిచేస్తోంది. ఇప్పటికే ట్యాగ్ పూర్తికావడంతో పాటు ఆలయ చరిత్రకు సం బంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. యునెస్కో పరిశీలనకు పంపించి ఆలయానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టిసారిస్తే త్వరితగతిన యునెస్కో గుర్తింపు లభించే అవకాశాలుంటాయి. యునెస్కో గుర్తింపువస్తే ఆలయానికి దేశ, విదేశాల పర్యాటకుల సందడి పెరగనుంది.

2002 వరకు వరకు గబ్బిలాల మయం

వేదఘోషతో అలరారిన ప్రాంతం, రాజసం ఉట్టిపడిన నాటి అద్భుత త్రికూట శ్రీఛాయసోమేశ్వర ఆలయం కొన్నాళ్ల క్రితం వరకూ గబ్బిలాల మయమై శిథిలావస్థలో ఉండేది. ఆలయంలో పూజ క్రతువులు లేక శిథిలమై కంప చెట్లమయమైంది. 2002లో శివదీక్ష వేసుకోవడానికి వెళ్లిన మిత్రులందరూ ఆలయ దుస్థితిని చూసి, ఆలయ అభివృద్ధి కోసం కంకణబద్ధులయ్యారు. శివభక్తులతో పాటు రుద్రసేన సభ్యులు ఆలయం అభివృద్ధికి నిర్ణయించుకున్నారు. 2004లో అప్పటి ప్రభుత్వం, పురావస్తుశాఖ, దేవదాయ శాఖల సహకారంతో ఆలయ పాలకవర్గాన్ని నియమించింది. అప్పటి నుంచి క్రమక్రమంగా ఆలయం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఒక అద్భుతమైన కోవెల రూపంలో శ్రీఛాయా సోమేశ్వర ఆలయం దర్శనమిస్తోంది. కొన్నేళ్లుగా ప్రతినిత్యం దీపారాధనతో పాటు పూజా క్రతువులు నిర్వహిస్తున్నారు. ఆలయంలో తొలి ఏకాదశితో పాటు నిత్యాభిషేకాలు, కార్తీక మాసం, కార్తీక పౌర్ణమి, దసరా, మహాశివరాత్రి, ఉగాది వంటి పర్వదినాలను నిర్వహిస్తూ వస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా యజ్ఞాలు, మహాన్యాస సంపూర్ణ రుద్రాభిషేకాలు, కల్యాణం, అగ్నిగుండాలు, తెప్పోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయంలో కాలభైరవ కాళికమాత అభయాంజనేయ, నటరాజు స్వామి, రాజరాజేశ్వరీ అమ్మవారు, లక్ష్మీదేవి, నందీశ్వరులు వంటి విగ్రహాలను నెలకొల్పారు.



ఆలయాన్ని సందర్శించిన హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే (ఫైల్)

దేవాలయ సందర్శన ఓ అనుభూతి



నల్లగొండలో బంధువుల వివాహానికి వచ్చిన సందర్భంగా ఛాయాసోమేశ్వరాలయాన్ని సందర్శించా. ఎంతో అనుభూతి కలిగింది. దేవాలయ పరిసర ప్రాంతాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. శివుడిని దర్శించుకుని పూజలు నిర్వహించడం, గర్భగుడిని, ఉపదేవాలయాలను చూడటం సంతోషాన్ని ఇచ్చింది. సమయం ఉన్నప్పుడల్లా ఈ దేవాలయ సందర్శనకు కుటుంబంతో కలిసి వస్తా.

● ఎస్. హర్షిత, నెల్లూరు.



ఆలయానికి వెళ్లే ప్రవేశ మార్గం

శిల్ప సంపదకు కెమికల్ వాష్ అవసరం



చారిత్రాత్మకమైన శిల్ప సంపదకు కెమికల్ వాష్ చేయడానికి పురావస్తు శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. శిల్పాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ శిల్పాలన్నీ పూర్వవైభవం సంతరించుకునేలా విగ్రహాలు, కట్టడాలు దెబ్బతినకుండా కెమికల్ వాష్ చేయాలి. ఇందుకోసం 12ఏళ్ల క్రితం రూ.28లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే ఆలయం తేజోవంతంగా విరాజిల్లుతుంది. కోనేరు చుట్టూ నాలుగు వైపులా రాతి మెట్ల నిర్మాణం చేపట్టడంతో పాటు తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా కోనేరు మధ్యలో మండపం పునర్నిర్మించాలి. గతంలో ఆ స్థానంలో మండపం ఉన్న ఆనవాళ్లు ఉన్నాయి. దేవాలయం చుట్టూ 100ఫీట్ల రోడ్డును నిర్మించాలి. రుద్రసేనలో కీలక సభ్యుడైన అనుముల మండలానికి చెందిన రైతు చింతల వెంకట్‌రెడ్డి దేవాలయం అభివృద్ధి కోసం, రూ.25లక్షల బంగారు, వెండి ఆభరణాలను సమర్పించారు. ఆలయ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడంతో పాటు యునెస్కో గుర్తింపునకు సహకరించాలి.

● గంట్ల అనంతరెడ్డి, దేవాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్

ఆలయ సంపద అద్భుతంగా ఉంది



శతాబ్దాల నాటి చారిత్రక సంపద అద్భుతంగా ఉంది. అనేకసార్లు ఈ దేవాలయాన్ని సందర్శించా. శివలింగాన్ని దర్శించుకోవడం, పూజలు నిర్వహించడం మర్చిపోలేని అనుభూతి. ఆలయ పరిసరాలు, కోనేరుతో పాటు మొక్కలు, కొబ్బరి చెట్లు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఆధ్యాత్మిక భావన పెంపొందుతోంది. దేవాలయం అభివృద్ధి చెందింది.

● ఇందిరా, హైదరాబాద్

ఆలయ పరిరక్షణలో 'రుద్రసేన' కీలక పాత్ర



ఛాయాసోమేశ్వరాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కాపాడుకోవడానికి రుద్రసేన కమిటీ ఏర్పాటైంది. కొన్నేళ్ల క్రితం దేవాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గట్ల అనంతరెడ్డి నేతృత్వంలో 400మందికి పైగా సభ్యులతో రుద్రసేనను ఏర్పాటు చేశారు. కొలను అభివృద్ధి, చుట్టూ మొక్కలు నాటారు. భక్తులకు సేవలు అందించడంలో సభ్యులు కీలక భూమిక పోషిస్తున్నారు. పురావస్తు శాఖ నిధులకు సంబంధించి రూ.38లక్షలతో 2008లో శిథిలమైన నిర్మాణాలను, కంపౌండ్ వాల్‌తో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. 100మంది శివభక్తులు ఆలయాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. దేవాలయ పరిసరాల్లో రెండు వేల మొక్కలు నాటారు. ఇందులో కొబ్బరి, ప్యాక్స్‌టైల్స్, రుద్రాక్ష, పొన్న, కదంబం వంటి మొక్కలు ఉన్నాయి. దేవతా వృక్షాన్ని కూడా నాటడంతో పాటు మొక్కల సంరక్షణకు డ్రిప్‌ను ఏర్పాటుచేసి సేంద్రియ ఎరువులతో మొక్కలను సంరక్షిస్తున్నారు. షెడ్ల విస్తరణతో పాటు పార్కింగ్ షెడ్ నిర్మించారు. వాటర్‌ప్లాంట్, సెక్యూరిటీ టవర్, కార్యాలయం, యాగశాల నిర్మాణంతో పాటు ఆలయ భూముల పరిరక్షణ కోసం చుట్టూ స్టీల్ రేలింగ్‌తో ఫెన్సింగ్ చేపట్టారు. ఎలక్ట్రికల్ పనులు, మంచినీటి పైపులైన్లను అభిషేకం కోసం ప్రత్యేక వాటర్‌ట్యాంక్‌ను కూడా ఏర్పాటుచేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి

తుర్కపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని సైదాపూర్‌లో ఈ నెల 15వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని రామాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో పాఠశాల నుంచి ఎయ్యేముల అంజలి, ఆకుల పూజ, దాసారం రాధిక, గుండెబోయిన భార్గవి, గౌరబోయిన ప్రవళిక ఎంపికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా ఎయ్యేముల అంజలి ఎంపికైంది. విద్యార్థులు ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పీడీ రమేష్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి విద్యార్థులను అభినందించారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



బీబీనగర్ టోల్‌ప్లాజా వద్ద వేచి ఉన్న వాహనాలు

బీబీనగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారి ఆదివారం వాహనాల రద్దీ పెరిగింది. సెలవు దినం కావడంతో యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, భువనగిరి స్వర్ణగిరి దేవాలయంలోని వేంకటేశ్వరస్వామి దైవ దర్శనాల కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివాహ శుభ కార్యాలు కూడా ఉండడంతో ఉదయం కూడా వరంగల్ వైపు రోడ్డు మార్గం రద్దీగా మారింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపు వెళ్లే మార్గం వాహనాలతో రద్దీగా కనిపించింది. మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు కిలో మీటరు మేర బారులు తీరాయి. సాధారణ రోజుల్లో కంటే ఆదివారం రోజు అదనంగా రెండు వేల నుంచి మూడు వేల వాహనాలు రాకపోకలు సాగించి ఉంటాయని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు.

సాగర్ అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు

● సుమారు 15ఎకరాల్లో పాక్షికంగా దగ్ధం ● మంటలు ఆర్పిన అటవీ సిబ్బంది



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం మూలతండా వద్ద నాగార్జునసాగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మంటలు చెలరేగాయి. సుమారు 15 ఎకరాల్లో పాక్షికంగా అటవీ ప్రాంతం దగ్ధమైంది. అటవీ శాఖ సెక్షన్ అధికారి రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మూలతండా సమీపంలోని అడవిలో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు తెలిపారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఎయిర్ బ్లోయర్లతో మంటలు ఆర్పారు. అప్పటికే 15ఎకరాల్లో పాక్షికంగా చెట్లతో పాటు ఏపుగా పెరిగిన ఎండు గడ్డి కాలిపోయిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పశువులను, మూగ జీవాలను మేపడానికి అటవీ ప్రాంతంలోకి వచ్చిన వ్యక్తులు సిగరెట్, బీడీలను కాల్చివేయడంతో ఈ సంఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

యాదగిరికొండపై భక్తుల రద్దీ



గర్భాలయంలోని క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల రద్దీ


భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు సుమారు 40వేల మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారని అధికారులు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనాలకు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద రద్దీ నెలకొంది. భక్తులను కొండపైకి తరలించేందుకు అధికారులు తగినన్ని బస్సులు ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 44,14,051ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయం భువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా నిర్వహించారు. పాతగుట్టలో స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా నిర్వహించారు. శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, రుద్ర హవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహా నివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

యాగశాలను పరిశీలించిన ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై ఈ నెల 19 నుంచి 22 వరకు మహాకుంభాభిషేకం, వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సంప్రోక్షణ నిర్వహించేందుకు ఆలయ ఉత్తర తిరువీధిలో ఏర్పాటు చేసిన యాగశాలను ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు ఆదివారం పరిశీలించారు. చంద్ర, త్రిభుజ, చతురస్ర, అర్ధచంద్ర, పద్మఆకారంలో ఐదు హోమకుండాలు ఏర్పాటు చేసి తుది మెరుగులు దిద్దారు. అనంతరం గరుడ పతాకాన్ని ఆవిష్కరించేందుకు, హోమ కుండాలకు తుది మెరుగులు దిద్దే ప్రక్రియలో మరిన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచతల స్వర్ణగోపురాన్ని రుత్వికులు, వేద పండితుల వేదమంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలతో ప్రారంభించేందుకు ముహూర్తం నిర్ణయించినందున మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.



నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

స్వాగత తోరణాలు ఏర్పాటు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, మహాశివరాత్రి, వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19న ప్రారంభమై మార్చి 11న ముగుస్తాయి. ఇందుకోసం క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ కాంతులు విరజిమ్మేందుకు వీధి దీపాలు, ప్రధాన కూడళ్ల వద్ద స్వాగత తోరణాల ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాకేంద్రం, కలెక్టరేట్, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి, యాదగిరిపల్లి ప్రధాన కూడళ్ల వద్ద భారీ స్వాగత తోరణాలు సిద్ధమవుతున్నాయి. యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాన రహదారి వెంట రథచక్రాలు వాటిపై పక్షులు, వివిధ ఆకృతులతో ఆకర్షణీయంగా ఆరు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి తెలిపారు.

'వృక్షార్చన'ను విజయవంతం చేయాలి

● నేడు కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ● బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వృక్షార్చన పోస్టర్‌ను విడుదల చేస్తున్న రవీంద్రకుమార్

నల్లగొండ, దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వృక్షార్చన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 17న జిల్లా వ్యాప్తంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త సంతోష్‌కుమార్ పిలుపుమేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, కృష్ణ, పొట్ట మధు, చంద్రమౌళి, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 7గంటలకు యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, బీఆర్ఎస్ ఆలేరు ఇన్‌చార్జి గొంగిడి సునీత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ఆయన పాల్గొంటారు. 8.30గంటలకు భువనగిరి పట్టణంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవనం ఎదుట భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు హాజరవుతారు. 10 గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన మెడికల్ కళాశాల ఎదుట మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన వేడుకలు, 11.30గంటలకు మిర్యాలగూడ నియోజకవర్గం దామచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఏర్పాటు చేసిన సంబరాల్లో పాల్గొంటారు.

గురుకుల ఘటనపై కొనసాగుతున్న విచారణ

● పాఠశాలకు వెళ్లి వచ్చిన సీఐ

దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణ శివారు పెంచికల్‌పహాడ్ ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆకతాయి హల్‌చల్ చేసిన ఘటనపై విచారణ కొనసాగుతోంది. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తే జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చే అవకాశముంది. గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రవేశ పరీక్షలు ఆదివారం కూడా జరిగాయి. పరీక్షల బిజీలో ఉన్నామని అధికారులు చెబుతున్నారు. కాగా దేవరకొండ సీఐ నర్సింహులు ఆదివారం కళాశాలకు వెళ్లి వచ్చారు. పరీక్షలు జరుగుతున్నందున ఒకసారి విచారణ చేసి వచ్చినట్లు తెలిపారు. గిరిజన గురుకులంలో గతంలో కూడా రాత్రివేళలో కాపలాగా ఇద్దరు వాచ్‌మన్లు ఉండేవారు. ఇటీవల మహిళా వాచ్‌ఉమెన్‌ను వంట సెక్షన్‌కు మార్చడంతో చేయడంతో వాచ్‌మన్ ఒక్కడే విధులు నిర్వహిస్తున్నాడు. గేటు వద్ద వాచ్‌మన్ ఉంటే విద్యార్థుల గదుల వద్ద వాచ్‌ఉమన్ విధులు నిర్వహించేది. గతంలో మాదిరిగానే వాచ్‌ఉమన్‌ను కూడా నియమించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరు తున్నారు. కాగా గురుకుల పాఠశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్ సెలవు లో ఉన్నారు. పరీక్షల బిజీగా ఉన్నానని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిత సమాధానం చెబుతున్నారు. పాఠశాలలోకి ఆకతాయి ప్రవేశి ంచడంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు. ఈ వి షయమై జిల్లా గురుకుల పాఠశాలల ఆర్‌సీవో బలరాంనాయక్‌ను వివరణ కోరగా ఎంట్రన్స్ పరీక్షలలో బిజీగా ఉన్నామని, రెగ్యులర్ ప్రిన్సిపాల్ వస్తారని, విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



బుద్ధవనం మహాస్తూపం లోపల డీఎఫ్‌వో తదితరులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నల్లగొండ జిల్లా అటవీ అధికారి రాజశేఖర్ అన్నారు. ఆయన తన స్నేహితులతో కలిసి నల్లగొండ జిల్లా సాగర్ హిల్‌కాలనీలో బుద్ధవనాన్ని ఆదివారం సందర్శించారు. చరిత వనం, ధ్యాన వనం, స్తూపవనం, మహాస్తూపాలను తిలకించారు. మహాస్తూపం లోపల కొద్దిసేపు ధ్యానం చేశారు. బుద్ధవనం విశేషాలను వారికి పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. ఆయన వెంట అటవీశాఖ అధికారి రమేష్ ఉన్నారు.

'ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలి'

కట్టంగూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈదులూరులో చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బూరుగు సత్తయ్య, నాయకులు గజ్జి రవి, మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

'భవన నిర్మాణానికి సహకరించాలి'

చిట్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో అసంపూర్తిగా ఉన్న యాదవసంఘం భవనం నిర్మాణం పూర్తి చేయడానికి సహకరించాలని గోకుల యాదవ సంఘం నాయకులు కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే వీరేశంను కలిశారు. యాదవసంఘం భవన నిర్మాణం పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఏళ్ళ చంద్రశేఖర్, నాయకులు కడారి సత్యనారాయణ, సాగర్ల మహేష్, బట్టు నరేష్, నీల నరేష్, నరేష్ పాల్గొన్నారు.

డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

● ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్



రేషన్‌షాపులో మిషన్‌ను పరిశీలిస్తున్న రఘునందన్

మర్రిగూడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల డీ లర్లు ప్రజా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్నటువంటి చౌకధరల దుకాణాలను ఆదివారం ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ కొంతమంది డీలర్లు ప్రజా పంపిణీ ముగిశాక కూడా బియ్యం అక్రమాలకు పాల్పడినట్లు వెలుగు చూశాయని, అందుకుగాను బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేయవద్దని సూచించారు. రేషన్ డీలర్లపై రెండు పర్యాయాల కంటే ఎక్కువగా కేసు నమోదైతే డీలర్ షిప్ రద్దుకు కూడా వెనకాడేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో సమయ స్ఫూర్తిగా వ్యవహరించాలని అన్నారు. ఆయన వెంట డీలర్లు ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా 'ఆదర్శ'బోధన

● ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన

● ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

● ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

● ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశపరీక్ష



పెద్దాపురంలో ఆదర్శ పాఠశాల, పాఠశాలలోని ల్యాబ్‌లో ప్రాక్టికల్ చేస్తున్న విద్యార్థినులు

నాంపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు ఈ విద్యను సద్వినియోగం చేసుకొని పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. నాంపల్లి మండలంలో గల పెద్దాపురం గ్రామంలో గల ఆదర్శ పాఠశాల 6 నుంచి 10వ తరగతిలో మిగిలిన ఖాళీల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాలు ఉంటాయి. ప్రతీ సంవత్సరం 6వ తరగతిలో 100 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు 500మంది విద్యార్థులు ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇదే కా కుండా ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విద్యార్థులకు విద్య అందుబాటులో ఉంది. దూర ప్రాంత బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉంది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల ఆదర్శ పాఠశాలల్లో చేరడానికి 2025-26 విద్యా సంవత్సరానికి ఈ నెల 28 వరకు అవకాశం ఉంది.

అధునాతన వసతులు

ఆదర్శ పాఠశాలల్లో అధునాతన భవనంతో విశాలమైన తరగతి గదులు ఉన్నాయి. విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేస్తూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంచుతున్నారు. విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు ఎంసెట్, నీట్ వంటి శిక్షణ కూడా ఇస్తున్నారు. దూర ప్రాంత విద్యార్థులకు ఇంటర్ చదువుతున్న బాలికలకు 100 మంది విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నారు.

స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యత

ఆదర్శ పాఠశాల ప్రవేశాల్లో స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. ఆ తర్వాత ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ప్రవేశ పరీక్షలో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్లం పాఠ్యాంశాలపై 25 మార్కుల చొప్పున ప్రశ్నలు ఉంటాయి. సమాధానాలు ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాల్సి ఉంటుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

ప్రతిభ చాటుతున్న విద్యార్థులు

ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ప్రతిభ చాటుతున్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అధిక సంఖ్యలో 10 జీపీఏ సాధిస్తున్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుల స్వీకరణ

ఆదర్శ పాఠశాలలో చేరడానికి ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలి. ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌ఫోటోతో మీ సేవ, ఇంటర్ నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.125, జనరల్ విద్యార్థులకు రూ.200 ఫీజు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది. 6వ తరగతి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

ప్రశాంత వాతావరణంలో విద్యా బోధన



విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన జరుగుతుంది. విద్యార్థులు సృజనాత్మక మార్పులు తేవడానికి కృషి చేస్తున్నాం. పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చడానికి మా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

● భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్, పెద్దాపురం, నాంపల్లి

గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన సంత్ సేవాలాల్



అజలాపురంలో సంత్ సేవాలాల్ దేవాలయానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మర్రిగూడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గిరిజనులను చైతన్య పరుస్తూ వారి అభివృద్ధికి సంత్ సేవాలాల్ మహరాజ్ ఎంతో కృషి చేశారని మాజీ సర్పంచ్, సంత్ సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని అజలాపురం గ్రామంలో ఆదివారం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. తండాల్లో సేవాలాల్ దేవాలయ నిర్మాణ కోసం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులను చైతన్యం చేసి తం డాల్లో స్వరాజ్యం కోసం నడుం బిగించిన మహనీయుడని పేర్కొన్నారు. గిరిజన యువతరం సేవాలాల్ పోరాట మార్గాన్ని ఎంచుకొని ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో మేగావత్ చంద్‌లాల్, నరేష్, రమేష్, చంటి, కృష్ణ, లక్ష్మణ్, యాదగి రి, కిషన్, రాందాసు, సుధాకర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మహిళలు

నల్లగొండటౌన్ ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల నీలగిరి కాలనీలో ఆదివారం వైభవంగా శ్రీ లక్ష్మీనర్సింహస్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, ఆలయ నిర్వాహకులు, కాలనీ ప్రజలు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ప్రదీప్‌నాయక్, చిన్నాల అలివేలు జానయ్య, వివిధ వార్డులకు చెందిన పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాలని జిల్లా ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ (ఐఓసీఎల్) సేల్స్ ఆఫీసర్ బి.దిలీప్‌నాయక్ అన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన 2024-25 సాక్ష్యం వాక్ దాన్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు సురక్షితమైన వాతావరణం అందించాలని అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, సిబ్బంది, డెలివరీ బాయ్స్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు

కబడ్డీ పోటీల్లో శాలిగౌరారం జట్టు ప్రతిభ

● ద్వితీయ బహుమతి సాధించిన క్రీడాకారులు

శాలిగౌరారం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలు, గంజాయికి బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించేందుకు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశానుసారం జిల్లాలో మిషన్ పరివర్తన - యువతేజం కార్యక్రమంలో భాగంగా క్రీడీ పోటీలు నిర్వహించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నల్లగొండ డివిజన్‌లో శాలిగౌరారం జట్టు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. జట్టు క్రీడాకారులకు ఎస్పీ శరత్‌చంద్రపవార్ షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో శాలిగౌరారం ఎస్ఐ డి.సైదులు పాల్గొని క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం పొందినందుకు శాలిగౌరారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, పీడీ బొడ్డ మల్లేష్‌ను క్రీడాకారులు అభినందించారు. కార్యక్రమంలో శాలిగౌరారం పోలీస్ బృందం పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



ఎల్లమ్మను దర్శించుకున్న వైద్యుల బృందం

కనగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ, అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం సమర్పించారు. ఇదిలా ఉంటే నల్లగొండ పట్టణంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన వైద్యుల బృందం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా అభిషేకం, కుంకుమార్చన పూజలు



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని రెండో వార్డు మైసమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మతల్లి దేవాలయంలో అభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ అర్చకులు గంటసాల శర్మ పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సమడం శ్రీను, గోపర్ల శ్రీను, కలారి శ్రీకాంత్, యశ్వంత్, శేఖర్ పాల్గొన్నారు.

శివాజీ జయంతిని విజయవంతం చేయాలి

దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని విజయవంతం చేయాలని శివాజీ యువదళ్ నగర గౌరవ అధ్యక్షుడు నేతాళ్ల వెంకటేష్, వ్యవస్థాపకుడు హరికృష్ణ అన్నారు. ఆదివారం శివాజీ యువదళ్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవాలయం నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. శివాజీ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 19న పట్టణంలో శోభాయాత్ర, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శివాజీ యువదళ్ కోశాధికారి నిమ్మల గణేష్, అనిల్, గుండాల అంజి, గడ్డం శివ, యశ్వంత్, అజయ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించాలి.

స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైదానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సైదానాయక్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ కోరారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగార్చుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,350కోట్లు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో నల్లగొండలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం 11 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు మని, తరుణ్, కుమార్, ఈశ్వర్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు అంతంతే!

(5వ పేజీ తరువాయి)

లేకపోవడం, అడపాదడపా వడ్డీ మాఫీ చేయడం లాంటి కారణాలతో కొందరు యజమానులు ఆస్తి పన్ను చెల్లించడం లేదు. మరికొన్ని భవనాలు శిథిలావస్థకు చేరి నివాసయోగ్యంగా లేకపోవడంతో ఆయా భవనాల ఆస్తి పన్ను లెక్కలోకి వెళ్తున్నట్లు మునిసిపల్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అలాంటి ఇళ్లకు ఆ స్తిపన్ను చెల్లించేందుకు యజమానులు నిరాసక్తి చూపుతున్నారు. మరికొన్ని ఇంటి నెంబర్లు ఉన్న గృహాలు నేలమట్టమైనా రికార్డుల నుంచి వాటిని తొలగించకపోవడంతో ప్రతీ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను జనరేట్ అవుతోంది. అలాగే ప లు భవనాల అక్రమ కొలతలను సవరిస్తే భారీగా ఆస్తిపన్ను డిమాండ్ పెరిగే అ వకాశం ఉంది. నల్లగొండలో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఇలా ఉన్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలు		రావాల్సింది (కోట్లలో)	వసూళ్లు (కోట్లలో)	బకాయి (కోట్లలో)
కేంద్ర ప్రభుత్వం	96	227.97	0	2022.92
రాష్ట్ర ప్రభుత్వం	300	1093.52	6.5	1087.02
మొత్తం	396	1321.44	6.5	1314.94

ఆస్తి పన్ను చెల్లించకపోతే జప్తు చేస్తాం

ఆస్తిపన్ను చెల్లించాలని బకాయిదారులందరికీ ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చాం. అయినా కొంతమంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. అటువంటి వారి ఆస్తులను జప్తు చేస్తాం. ప్రతీ ఒక్కరు ఆస్తి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

● శివరాంరెడ్డి, మునిసిపల్ రెవెన్యూ అధికారి,

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, అప్పుడే మోదీ, రాహుల్ కులమేంటో ప్రజలందరికీ తెలుస్తుందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కుల గణన చేపట్టకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు విమర్శలు గుప్పించుకోవడం సరికాదన్నారు. దేశంలోని జంతువులు, చెట్లు, వాహనాలకు లెక్క ఉందని, బీసీల లెక్క మాత్రమే లేకపోవడం దురదృష్టకరమన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బంటు వెంకటేశ్వర్లు, అంజి, శ్రీను, రాంబాబు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేరడలో ప్రారంభమైన పెద్దగట్టు జాతర

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం నేరడ గ్రామంలో లింగమంతులస్వామి కొలువైన పెద్దగట్టు జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున సంప్రదాయబద్ధంగా పలహారపు ఎద్దుల బండ్లతో ప్రదర్శనగా గ్రామశివారులోని గుట్టమీదికి యాదవులు భక్తిశ్రద్ధలతో వెళ్లారు. యాదవులు ఓ లింగా... ఓ లింగా అంటూ లింగమంతుల స్వామి నామస్మరణతో ఆట, పాటలు, నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. గుట్టమీద కొలువుదీరిన మాణిక్యమ్మ ఆకుమంచమ్మ, లింగమంతుల స్వామి, ఎలమంచమ్మ, చౌడలమ్మతల్లి, గంగమ్మ తల్లి రేణుకా ఎలమ్మతల్లి దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ జాతరలో భాగంగా నెల 17వ తేదీన లింగమంతుల స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఉత్సవ నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేసిన గోపాల్‌రెడ్డి : మంత్రి

నల్లగొండటౌన్ ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌రెడ్డి పనిచేసిన ప్రతి పాఠశాలను అంకితభావంతో అభివృద్ధి చేశారని, ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వరంగల్ -ఖమ్మం -నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి మంత్రి వెంకట్‌రెడ్డిని కలిశారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు పౌరుడిగా సామాజిక సమస్యలపై స్పందించి పనిచేస్తున్న ఉద్యమకారుడు గోపాల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మద్దతు తెలిపినందుకు గోపాల్‌రెడ్డి మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ డాక్టర్ తోట నరసింహచారి, విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధీరావత్ వీరనాయక్, కృష్ణారెడ్డి, బోధనం నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నల్లగొండ, వరంగల్, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీగా తపస్ బలపర్చిన బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. జిల్లాలోని కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాలలో ఆదివారం ఆమె పార్టీ నాయకులతో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా మండలాలలోని ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్ల ఇళ్లకు వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని ఆమె అభ్యర్థించారు. అంతకు ముందు పార్టీ నాయకులతో నిర్వహించిన సమీక్షలో వివిధ గ్రామాల్లో గల ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. ఆయా ఓటర్లను స్వయంగా కలిసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆమె నాయకులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు ఎ.అనితాగౌడ్, నర్సింహాచారి, వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మైల్ల పరమేష్, నర్సింహ, నర్సింహ, మొగులయ్య, అంజయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలివెల జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లయ్య, నర్సింగరావు, పరిపూర్ణ, సుప్రియ, ఉదయ శ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డొంకల శేఖర్, నాతి శేఖర్, శ్రీశైలం, రవి, సతీష్, మహేష్, లింగస్వామి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలి

శాలిగౌరారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నిర్వహించనున్న భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, సూర్యాపేట జిల్లా కార్యదర్శి షేక్ నజీర్‌లు తెలిపారు. శాలిగౌరారంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణంలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఈ నెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

స్నేహితుడికి కుటుంబానికి ఆర్థికసాయం

కనగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన గట్టిగుండ్ల భిక్షమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రిని కోల్పోయి కష్టాల్లో ఉన్న భిక్షమయ్య కుమారుడు యాదగిరిని అతని బాల్య స్నేహితులు ఆదివారం ఇంటి వద్ద కలిసి పరామర్శించారు. యాదగిరి తల్లికి (మృతుడి భార్యకు) రూ.11 వేల ఆర్థికసాయం అందించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో తేలకంటిగూడెం మాజీ సర్పంచ్ బోగరి రాంబాబు, నాగరాజు, నవీన్‌రెడ్డి, శేఖర్, రాజు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల రూరల్: చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన చేపూరి బాపూరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి టెర్రీగోల్డ్ కంపెనీ కార్మికులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తన వంతు సహాయంగా రూ.26,100వేల నగదును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టెర్రీగోల్డ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ కార్మికులు మర్రి తిరుమల్‌రెడ్డి, నూత వెంకటేశం, ఆవుల జానయ్య, సైదులు, రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5 సోమవారం 17 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	190	210
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5 । కనిష్ఠం 19.0

పెద్దగట్టుకు చేరిన దేవరపెట్టె

ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో.. భేరీల చప్పుడు, కటారీ విన్యాసాల నడుమ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతర సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్ధరాత్రి అట్టహాసంగా ప్రారంభమైంది. గంపలు, బోనాలు తలపై పెట్టుకొని కటారీలు చేతపట్టి, భేరీలు మోగిస్తూ కాళ్లకు గజ్జెలు కట్టి నృత్యాలు చేస్తూ యాదవులు లింగమంతుల స్వామిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. ఓ లింగా.. ఓ లింగా నామస్మరణం చేస్తూ గుడి చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. ఉదయం సమయం నుంచే భక్తులు లింగమంతుల స్వామి, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, సౌడమ్మ దేవతలను దర్శించుకున్నారు. కేసారం గ్రామంలో దేవరపెట్టెకు మున్న, గొర్ల, మెంతబోయిన కులస్థులు పూజలు చేసి పెద్దగట్టుకు ఆదివారం రాత్రి తరలించారు. దీంతో జాతర ప్రారంభమైంది. కేసారంలో జరిగిన పూజల్లో పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●6లో..

జాతరమ్మ జాతరో..



డోలు వాయిస్తున్న జగదీష్‌రెడ్డి, పూజల్లో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి

మహిళ డప్పు నృత్యం

ప్రజా సమస్యలను

పరిష్కరించడంలోనే సంతృప్తి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్ ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడు కలిగే సంతృప్తి మరెందులోనూ ఉండదని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతులు తీసుకొని కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుందన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల ముందు కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డును కమీషన్ కోసం విక్రయించారని విమర్శించారు. రూ.30వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేశారని అన్నారు. దశాబ్దాల నల్గొండ జిల్లా సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శ్రీశైలం టన్నెల్ బేరింగ్ మిషన్ పనులు ప్రారంభమయ్యాయని, అమెరికా నుంచి రాబిన్స్ బోరింగ్ కంపెనీ నుంచి మరో బేరింగ్ మిషన్ చెన్నై పోర్టు వరకు వచ్చిందన్నారు. రెండేళ్లలో శ్రీశైలం సొరంగం మార్గం పనులను పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలం టన్నెల్, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించామన్నారు. నల్లగొండ సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దానని పేర్కొన్నారు. ఇప్పటికే పట్టణంతో పాటు నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, అవన్నీ పూర్తయి త్వరలో నల్లగొండ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం అనుప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పాల్గొన్నారు.

'డయల్ యువర్ సైబర్ నేస్తం'ను

సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా సైబర్ క్రైమ్ సంబంధించిన సమస్యలు, సందేహాలను తెలుసుకునేందుకు డయల్ యువర్ సైబర్ నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితుల సమస్యల పరిష్కార మార్గాలను తెలుసుకునేందుకు 8712658079 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఛాయా రహస్యం..

సోమేశ్వరాలయం



పానగల్ సమీపంలోని ఛాయా సోమేశ్వరాలయం

●7లో..

ఆస్తి పన్ను వసూలు

అంతంతే!



- హాలియా మునిసిపాలిటీలో 0.5శాతమే వసూలు
- నల్లగొండ మునిసిపాలిటీలోనూ 18.5శాతమే
- ముంచుకొస్తున్న గడువు

రామగిరి, మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులు చెల్లించే పన్నులే మునిసిపాలిటీకి ప్రధాన వనరు. ఆస్తిపన్ను, భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు, నల్లా చార్జీలు, ట్రేడ్ లైసెన్స్, మునిసిపల్ ఆస్తుల అద్దెలు తదితర రూపాల్లో మునిసిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. వీటిలో ఆస్తి పన్నుదే ప్రధాన వాటా. నిర్మాణ అనుమతుల పేరుతో ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుండగా, ఆస్తి పన్నును మాత్రం ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి వందశాతం వసూలు లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగాలు కృషి చేస్తుంటా యి. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం మరో 40 రోజుల్లో ముగియనుండగా, జిల్లాలోని నల్లగొండ మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూలు అంతంత మాత్రంగానే ఉంది. నల్లగొండలో 18.5 శాతం, హాలియాలో అత్యల్పంగా 0.5శాతం, దేవరకొండలో 53.39శాతం, మిర్యాలగూడలో 63.90 శాతం ఆస్తి పన్ను వసూలైంది.

నల్లగొండలో 48వార్డులకు 36,150 నివాస గృహాలు ఉండగా 3,481 కమర్షియల్ గృహాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.16.62కోట్ల ఆస్తిపన్ను రావాల్సి ఉంది. పాత బకాయిలు రూ.14.91కోట్ల పైచిలుకు ఉంది. అపరాధ రుసుము కలిపి రూ.48.41కోట్ల బకాయి ఉంది. అయితే ఇప్పటి వరకు సుమారు రూ.12 కోట్లు వసూలు కాగా, రూ.37కోట్ల పైచిలుకు అద్దె రూపంలో రావాల్సి ఉంది. దీంతో పట్టణంలో రూ.50వేలకు పైబడి ఉన్న 600 మంది బకాయిదారులకు 10 రోజుల క్రితం మునిసిపల్ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం రెడ్ నోటీసులు అందుకున్న వారం రోజుల్లో స్పందించాల్సి ఉంటుంది. అందులో కొంతమంది బకాయిలు చెల్లించగా, మరికొంతమంది నిర్లక్ష్యాన్ని వీడకపోవడంతో వారి ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయల బకాయి రూ.13కోట్లకు పైగా

నల్లగొండ పట్టణంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 96 కార్యాలయాలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 300 కార్యాలయాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.88.5కోట్ల పన్ను రావాల్సి ఉండగా, రూ.4కోట్ల పైచిలుకు మాత్రమే వసూలయ్యాయి. సుమారు రూ.13కోట్ల పైచిలుకు వసూలవ్వాల్సి ఉంది. మొత్తంగా వివిధ గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు కలిపి రూ.50కోట్లకు పైగా రావాల్సి ఉంది.

వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక బృందాల ఏర్పాటు

మార్చి చివరి నాటికి వందశాతం వసూలు చేయాలన్న లక్ష్యంతో మునిసిపల్ అధికారులు ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఏడు నుంచి ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. గతంలో 48 వార్డులకు 10మంది బిల్ కలెక్టర్‌లు మాత్రమే ఆస్తి పన్నులను వసూలు చేసేవారు. ఇటీవల కొత్తగా 40మంది వార్డు ఆఫీసర్లు నియమితులయ్యారు. ఇప్పుడున్న పది మందితో పాటు ఈ వార్డు ఆఫీసర్లు ప్రతీ ఇంటిని తిరిగి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు.

బకాయిలు పేరుకుపోయేందుకు కారణాలెన్నో..

పన్ను బకాయిలు పేరుకుపోయేందుకు కారణాలెన్నో ఉన్నాయి. సకాలంలో పన్ను చెల్లించకున్నా చర్యలేమీ మిగతా 8వ పేజీలో...

ఆదాయం లేని నందికొండ

నూతనంగా ఏర్పాటైన నందికొండ(నాగార్జునసాగర్) మునిసిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఇక్కడ అన్నీ ప్రభుత్వ కార్యాలయాలే ఉండటం, పర్యాటక ప్రాంతం కావడంతో ప్రైవేట్ ఆస్తులు లేవు. ఇక్కడి భవనాలన్నీ ప్రభుత్వానికి చెందినవే ఉన్నాయి. నందికొండ మునిసిపల్ ఆఫీస్‌ను సాగర్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీలో 36 మంది పారిశుధ్య కార్మికులను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించగా, పురపాలికకు ఆదాయమే లేకపోవడంతో కలెక్టర్ స్పెషల్ ఫండ్ నుంచి వారికి వేతనాలు చెల్లిస్తున్నారు.

మునిసిపాలిటీ	ఆస్తులు	డిమాండ్ (రూ.కోట్లలో)	బకాయిలు (రూ.కోట్లలో)	వసూలు (రూ.కోట్లలో)
నల్లగొండ	4,42,474	6162.44	5016.52	1145.92
మిర్యాలగూడ	25,695	883.30	646.86	564.47
హాలియా	5,621	204.01	68.70	1.03
దేవరకొండ	7,062	288.44	37.31	154.01

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

- సంస్థాగత నిర్మాణంపై టీడీపీ దృష్టి
- స్థానిక ఎన్నికలకు సమాయత్తం

నల్లగొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ వర్గాలు దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును చేపట్టి కార్యకర్తల్లో నూతనోత్సాహం తీసుకొచ్చింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 24,720 సభ్యత్వాలను చేపట్టారు. పార్టీ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ సభ్యత్వాన్ని తీసుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడం కోసం కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అంతేకాక గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గత కమిటీలన్నింటినీ రద్దు చేసిన అనంతరం పార్లమెంట్ అడహక్ కమిటీని వేసి అందులో అన్ని నియోజకవర్గాలకు చెందిన నేతలకు ప్రాతినిధ్యం కల్పించారు. అడహక్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వ నమోదు పారదర్శకంగా ఉండటం కోసం ఆన్‌లైన్ విధానాన్ని చేపట్టడంతో గతంలో ఉన్న సభ్యత్వాలను రెన్యూవల్ చేయడంతో పాటు కొత్త సభ్యత్వాలను సేకరించారు. ఏపీ సీఎం చంద్రబాబు సమయం దొరికినప్పుడల్లా తెలంగాణకు వచ్చినప్పుడు తప్పనిసరిగా ఎన్టీఆర్ భవన్‌కు చేరుకొని అన్ని జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో భేటీ అవుతూ వస్తుండటంతో ఉత్సాహం నెలకొంటూ వస్తుంది. అదే విధంగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తరచుగా నాయకులు, కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి సీఎం చంద్రబాబుతో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేష్‌ను కూడా కలిసి పార్టీ బలోపేతం కోసం తీసుకుంటున్న కార్యాచరణపై వివరిస్తూ వస్తున్నారు. ఇకపోతే త్వరలోనే గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కమిటీలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ఆ పార్టీ యోచిస్తోంది. ఈ సందర్భంగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేలా పార్టీ ప్రణాళికలు రూపొందిస్తోంది. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మొత్తానికి జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టిన తమ్ముళ్లు సమరోత్సాహంతో ఉన్నారు.

'గురుకుల' ఘటనపై కొనసాగుతున్న విచారణ

● పాఠశాలను సందర్శించిన సీఐ

●7లో..

సాగర్ అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

మిర్యాలగూడలో

ఐసీఎస్ఎస్ఆర్ జాతీయ సదస్సు

వేదిక కానున్న కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోదండరాం, వీసీ అల్తాఫ్‌హుస్సేన్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలను ప్రోత్సహించే జాతీయ సంస్థ అయిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు మార్చి 17, 18వ తేదీల్లో పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనుంది.

తొలిసారిగా ఎంపికైన చదువుల కోవెల

ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సంస్థ ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా సెమినార్లు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. నోటిఫికేషన్‌కు అనుగుణంగా దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు అందుతాయి. అయితే పరిశోధన విభాగంలో ఉత్తమ ప్రాజెక్టు పంపిన కళాశాలను ఎంపిక చేసి జాతీయస్థాయి సదస్సు నిర్వహించడంతో పాటు సెమినార్ నిర్వహణకు ఆర్థిక సాయం అందిస్తుంది. ఐసీఎస్ఎస్ఆర్‌లో భాగంగా అర్థశాస్త్ర విభాగంలో కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొలిసారిగా ఎంపిక కావడం విశేషం.


కళాశాల చరిత్ర గొప్పదే..

పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 1981లో స్థాపించారు. ఎందరో విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు చేర్చిన కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని నింపి, సైనికుల్లాగా తీర్చిదిద్దే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో ఈ విద్యాలయం పలు ప్రశంసలు పొందింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడావిభాగం కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాలను ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఇక గతేడాది ఢిల్లీలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనేందుకు కేఎన్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవకాశం ఇవ్వడం గమనార్హం.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలతో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాతీయస్థాయి సెమినార్‌లో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలతో కూడిన ప్రజంటేషన్లు ఉంటాయి. గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ప్రాస్పెక్ట్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై నిర్వహించనున్న సెమినార్‌లో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించు పలు పరిశోధనాత్మక అంశాలతో కూడిన ప్రెజంటేషన్లు ఇవ్వనున్నారు. ఐటీ, ఐ-పాస్, ఫైనాన్షియల్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్, జీఎస్‌డీపీ, ట్రాన్స్‌పోర్ట్ అంశాలపై చర్చ నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు.

సెమినార్‌కు ఎంపిక గొప్ప విషయం



గ్రామీణ నేపథ్యం ఉన్న కళాశాల జాతీయస్థాయి సెమినార్‌కు ఎంపికవడం ఆనందంగా ఉంది. ఆర్థిక ప్రగతికి మూలమైన అర్థశాస్త్రంలో సెమినార్ నిర్వహించడం గొప్ప విషయం. కళాశాల స్థాపించి నాలుగు దశాబ్దాల కాలంలో తొలిసారిగా జాతీయస్థాయి సెమినార్‌కు ఎంపికైంది. కళాశాల అర్థశాస్త్ర విభాగానికి కృతజ్ఞతలు.

డాక్టర్ సముద్రాల ఉపేందర్, ప్రిన్సిపాల్,
కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రమాద మ(పి)లుపులు

● సాగర్ హైవేపై పెరుగుతున్న ప్రమాదాలు



చింతపల్లి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలపు

చింతపల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మూలమలుపుల వద్ద వాహనాలు అదుపు తప్పడమేగాక, ఎదురుగా వచ్చే వాహనాలు సడన్‌గా కన్పించకపోవడంతో ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్) నుంచి చింతపల్లి మీదుగా సాగర్ వరకు ఈ మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రెండు నెలల క్రితం తిరుగండ్ల మాజీ సర్పంచ్ అంజయ్య రోడ్డు దాటుతుండగా, కారు ఢీకొట్టడంతో మృత్యువాతపడ్డారు. ఆ కుటుంబం రోడ్డున పడింది. రోడ్డుపై సూచికలు లేకపోవడంవల్ల ఈ ప్రమాదం జరిగింది. ఇటీవల డిండి మండలం ఖానాపూర్ మాజీ సర్పంచ్ నసర్లపల్లి సమీపంలో ఆటో ఢీకొని మృతిచెందాడు. మూలమలుపుల వద్ద వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడుతున్నారు. శేరిపల్లిగేట్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలేపల్లిరాంనగర్ సమీపంలో రంగారెడ్డి జిల్లా తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వెళ్తుంటే కారు ఢీకొట్టడం జరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందారు. ఎక్కువగా ప్రమాదాలు మలుపుల్లోనే జరిగాయి.

త్వరలో సూచికలు ఏర్పాటు చేస్తాం

మలుపుల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. రోడ్లను త్వరలో పరిశీలించి రేడియం స్టిక్కర్లు, సూచికలు లేని చోట ఏర్పాటు చేయిస్తాం. ప్రమాదాల నివారణకు సంబంధించి పోలీసులతో మాట్లాడి వాహన చోదకులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తాం.

ప్రభాకర్, డీఈఈ, దేవరకొండ

కేసీఆర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించాలి

చింతపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నేడు(సోమవారం) మండలంలోని అన్నీ గ్రామాల్లో నిర్వహించుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అన్నీ వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశారని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ భూములపై నజర్

● విలువైన భూముల్లో బోర్డుల ఏర్పాటు ● ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కంచెలు ● బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ)

ప్రభుత్వ భూములపై అధికారులు దృష్టి సారించారు. ఆక్రమణలకు గురికాకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నారు. భవిష్యత్ అవసరాలకోసం భూములను కాపాడాలని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ సూచనల మేరకు రెవెన్యూ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లకు ఉపక్రమించింది. ఆక్రమణకు గురవుతున్న పట్టణ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు గుర్తించి బోర్డులు పాతిస్తున్నారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిలో ఉన్న కట్టడాలను నేలమట్టం చేయడమే కాకుండా ఇతరులు ఆ భూమిలోకి ప్రవేశించకుండా ఇనుప కంచెను ఏర్పాటు చేస్తున్నారు.

మల్లెతోట, ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణల తొలగింపు

తాళ్లగడ్డలోని సర్వేనెం. 60, 61 మల్లెతోటలో 3 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వ హయాంలో కొంతమంది ఆక్రమించి, ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రెవెన్యూ అధికారులు గత కొద్ది రోజుల క్రితం భూమిని సర్వే చేయించి నూతనంగా నిర్మిస్తున్న కట్టడాలను యంత్రాల సహాయంతో తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డు పాతించారు. ఆక్రమణలకు పాల్పడితే శిక్షార్హులుగా ప్రకటించారు. పందిర్లపల్లి చెరువు, ఇందిరమ్మ కాలనీ లేఅవుట్ 5-7 మధ్యనున్న ప్రభుత్వ సీలింగ్, చెరువు భూములు సర్వేనెం.519లో ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కొరడా ఝులిపించారు. చెరువు బఫర్‌జోన్‌లోకి ప్రవేశించకుండా హద్దురాళ్లను పాతించారు.

కొత్తగూడెంలో ఏడు ఎకరాలు ఆక్రమించే యత్నం

మిర్యాలగూడ మండలం కొత్తగూడెంలో డబుల్‌బెడ్ రూంల ఇళ్ల నిర్మాణంకోసం సుమారు తొమ్మిది ఎకరాలు సేకరించగా, రెండు ఎకరాల పరిధిలో ఇళ్ల నిర్మించగా ఏడు ఎకరాల వరకు భూమి మిగిలి ఉంది. చుట్టుపక్కల వారు ఆ భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ హరిబాబు ఆక్రమణలు తొలగించి యుద్ధ ప్రాతిపదిక హద్దులు ఏర్పాటు చేసి బోర్డులు పాతించాలని సూచించారు.



చింతపల్లి ఇందిరమ్మ కాలనీ బైపాస్ వద్ద సర్వే నెం. 626లో ప్రభుత్వ భూమికి పోలీస్ పహారాలో కంచె ఏర్పాటు చేస్తున్న కూలీలు

ప్రభుత్వ భూమి రక్షణకు కంచె

చింతపల్లి ఇందిరమ్మకాలనీ బైపాస్‌లోని సర్వేనెం.626 ప్రభుత్వ భూమికి రక్షణకు రెవెన్యూ శాఖ అధికారులు ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. ఈ నెల 13న రూరల్ పోలీసుల పహారాలో ఎకరం 15 గుంటల భూమి చుట్టూ సిమెంట్ కడీలు పాతించి ఇనుప ముళ్లకంచెను ఏర్పాటు చేయించారు. 2015లో ఈ భూమిని రూరల్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయ నిర్మాణాలకు కేటాయించారు. కాగా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరుకాకపోవడంతో భూమి ఖాళీగా ఉంది. నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్‌రోడ్‌లో ఇందిరమ్మకాలనీకి వెళ్లే జంక్షన్‌వద్ద ఈ భూమి ఉండటంతో భూమికి అత్యధిక విలువ పెరిగింది. గజం సుమారు రూ.60వేల నుంచి రూ.70వేలు పలుకుతుండటంతో భూమిని ఆధీనంలోకి తెచ్చుకునేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తూ వస్తున్నారు. రెవెన్యూ అధికారులు పాతిన బోర్డును తొలగించి గత కొద్ది రోజుల క్రితం రాత్రికిరాత్రే కాల్వ ఏర్పాటు చేసి దుక్కి దున్ని రెండురోజుల్లో నాట్లు వేశారు. ఈవిషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో పోలీసుల సహకారంతో వరినాట్లను తొలగించారు. తిరిగి ఇతరులు భూమిలోకి ప్రవేశించకుండా హెచ్చరికబోర్డు పాతి రూరల్ పోలీసుల పహారాలో అధికారులు కూలీలను వినియోగించి రక్షణ కంచెను ఏర్పాటుచేశారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు



ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు లేకుండా భూముల్లో అక్రమ కట్టడాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ భూముల్లో పాతిన బోర్డులను తొలగించే చర్యలకు పాల్పడితే సహించం. ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను సైతం గుర్తించి రక్షణ చర్యలు తీసుకుంటాం.

హరిబాబు, మిర్యాలగూడ తహసీల్దార్

శివాజీ జయంతిని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్ యాదవ్

దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని విజయవంతం చేయాలని శివాజీ యువదళ్ నగర గౌరవ అధ్యక్షుడు నేతాళ్ల వెంకటేష్, వ్యవస్థాపకుడు హరి కృష్ణ అన్నారు. ఆదివారం శివాజీ యువదళ్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవాలయం నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. శివాజీ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 19న పట్టణంలో శోభాయాత్ర, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శివాజీ యువదళ్ కోశాధికారి నిమ్మల గణేష్, అనిల్, గుండాల అంజి, గడ్డం శివ, యశ్వంత్, అజయ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సుకు రావాలని ప్రముఖులకు ఆహ్వానం





ఉర్సుకు రావాలని ఆహ్వాన పత్రికను గుత్తా సుఖేందర్‌రెడ్డి, జానారెడ్డికి అందజేస్తున్న కమిటీ చైర్మన్, సభ్యులు

చింతపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీ.కే.మల్లేపల్లిలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించే ఉర్సుకు హాజరుకావాలని కోరుతూ ఉర్సు కమిటీ చైర్మన్ కేవీ రమేష్ రాజు, కమిటీ సభ్యులు ఆదివారం పలువురికి ఆహ్వానం పంపారు. శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డితో పాటు మాజీ సీఎల్పీ నేత కందూరు జానారెడ్డి, ఎమ్మెల్యేలకు ఆహ్వానపత్రికను అందించారు. దేవరకొండ, ఇబ్రహీంపట్నం, తాండూరు ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఉర్సు వైస్ చైర్మన్ ఎండీ జాని మియా, కార్యదర్శి కృష్ణ, అబ్బయ్య, ఎండీసయ్యద్ పాష, ఎండీ యూసుఫ్‌పాష, రామదాసు సాగర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, అప్పుడే మోదీ, రాహుల్ కులమేంటో ప్రజలందరికీ తెలుస్తుందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కుల గణన చేపట్టకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు విమర్శలు గుప్పించుకోవడం సరికాదన్నారు. దేశంలోని జంతువులు, చెట్లు, వాహనాలకు లెక్క ఉందని, బీసీల లెక్క మాత్రమే లేకపోవడం దురదృష్టకరమన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బంటు వెంకటేశ్వర్లు, అంజి, శ్రీను, రాంబాబు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సైదానాయక్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ కోరారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగార్చుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,350కోట్లు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో నల్లగొండలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం 11 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు మని, తరుణ్, కుమార్, ఈశ్వర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలు అంతంతే!

(5వ పేజీ తరువాయి)

లేకపోవడం, అడపాదడపా వడ్డీ మాఫీ చేయడం లాంటి కారణాలతో కొందరు యజమానులు ఆస్తి పన్ను చెల్లించడం లేదు. మరికొన్ని భవనాలు శిథిలావస్థకు చేరి నివాస యోగ్యంగా లేకపోవడంతో ఆయా భవనాల ఆస్తి పన్ను లెక్కలోకి వెళ్తున్నట్లు మునిసిపల్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అలాంటి ఇళ్లకు ఆస్తిపన్ను చెల్లించేందుకు యజమానులు నిరాసక్తి చూపుతున్నారు. ఇక మరికొన్ని ఇంటి నెంబర్లు ఉన్న గృహాలు నేలమట్టం అయినా రికార్డుల నుంచి వాటిని తొలగించకపోవడంతో ప్రతీ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను జనరేట్ అవుతోంది. అలాగే పలు భవనాల అక్రమ కొలతలను సవరిస్తే భారీగా ఆస్తిపన్ను డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు



ఏళ్ల తరబడి పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టానికి అనుగుణంగా స్పందించని యజమానుల ఆస్తి జప్తు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. పన్ను వసూళ్లకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. పట్టణ ప్రజలు ఆస్తి, నల్లా పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

ఎండీ.యూసుఫ్, మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్

స.హ. చట్టం ఆక్టివిస్ట్ ఫోరం బాధ్యుల నియామకం

వేములపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మాతంగి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐపై అవగాహన కార్యక్రమాలు చేపడ్తానని, సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





మాతంగి అనిల్, పడిశాల సైదులు

జిల్లా కోశాధికారిగా సైదులు

త్రిపురారం ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్ ఫోరమ్ నల్లగొండ జిల్లా కోశాధికారిగా త్రిపురారం మండలానికి చెందిన పడిశాల సైదులు నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సైదులు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానన్నారు. ఆర్టీఐపై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. స.హ. చట్టం విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. స.హ. చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా అభిషేకం, కుంకుమార్చన పూజలు



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

దేవరకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని రెండో వార్డు మైసమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మతల్లి దేవాలయంలో అభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ అర్చకులు గంటసాల శర్మ పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సమడం శ్రీను, గోపర్ల శ్రీను, కలారి శ్రీకాంత్, యశ్వంత్, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్నెస్పీ స్థలంలో బోరు.. అడ్డుకున్న అధికారులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న రూ.కోట్ల విలువైన భూములను అక్రమార్కులు కబ్జాచేసి అతి తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. నాగార్జునసాగర్(నందికొండ) మునిసిపాలిటీలోని నాలుగో వార్డులో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి ఆదివారం బోరు వేస్తుండగా విషయం తెలుసుకున్న ఎన్నెస్పీ అధికారులు అక్కడకు చేరుకొని బోరు వేయవద్దని అడ్డుకున్నారు. అంతేకాకుండా ఈ స్థలంలో కాలనీలకు తాగు నీటిని సరఫరా చేసే పైపులైన్ కూడా ఉంది. ఆ పైప్‌లైన్‌ను ఎన్నెస్పీ అధికారులకు తెలియకుండా ప్రైవేటు వ్యక్తులతో పైప్‌లైన్‌ను పక్కకు జరిపించి ఈ స్థలాన్ని గతంలో రూ.8లక్షలకు విక్రయించినట్లు సమాచారం.

ఆక్రమిస్తే కఠిన చర్యలు



నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో ఉన్న ఖాళీ భూములన్నీ ఎన్నెస్పీకి చెందినవే. ఆ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరించి, చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

మల్లిఖార్జున్‌రావు, ఈఈ



ఆక్రమిత ఎన్నెస్పీ స్థలంలో వేస్తున్న బోరు



పక్కకు జరిపించిన తాగు నీటి పైపులైన్

ముచ్చటగా మూడోసారి

● టెండర్లు వేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
● పంచాయితీరాజ్ శాఖలో ముందుకు సాగని పనులు

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని పంచాయితీరాజ్ శాఖలో పాత పనులకు మూడోసారి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలుస్తోంది. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్‌శాఖ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.23కోట్లతో మంజూరైన పనులకు టెండర్లు కాక నిలిచిపోయినట్లు చర్చ కొనసాగుతోంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)



అనుముల మండలం యాచారంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్డు వేసి క్యూరింగ్ చేస్తున్న సిబ్బంది(ఫైల్)

బీటీ రోడ్ల నిర్మాణానికి నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రూ.15కోట్లకు, మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.8కోట్ల పనులు మంజూరుకాగా టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో వరుసగా మూడుసార్లు అధికారులు టెండర్లు కాల్‌ఫర్ చేసినప్పటికీ ఎవరూ టెండర్ కోట్ చేయలేదని తెలుస్తోంది. బీటీ మిక్సింగ్ ప్లాంట్ ఉన్న కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్ కోట్ చేయాలన్న నిబంధన ఉండటంతో ఇబ్బందిగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిర్యాలగూడ డివిజన్‌లో కేవలం నలుగురు కాంట్రాక్టర్లకు మాత్రమే బీటీ ప్లాంట్లు ఉండగా, అందులో ఇరువురు కాంట్రాక్టు పనులు మానుకున్నట్లు తెలుస్తోంది. 100కి.మీ పరిధిలోని మిక్సింగ్ ప్లాంట్ కలిగిన వారెవరైనా టెండర్ వేయడానికి అవకాశం ఉన్నప్పటికీ ముందుకు రాకపోవడంతో టెండర్లు పూర్తికాక పనులు ప్రారంభం కావడంలేదని విమర్శలు కొనసాగుతున్నాయి.

రూ.51కోట్లతో ప్రతిపాదనలు

మిర్యాలగూడ నియోజకవర్గంలో ఐదు మండలాల్లో సీఆర్ఆర్ కింద 16 పనులకు రూ.30.42కోట్లు, నాగార్జుసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం, నిడమనూరు, హాలియా మూడు మండలాల పరిధిలో 10పనులకు రూ.20.54 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపగా, సీఆర్ఆర్ ఎస్సీ కింద రూ.7.06కోట్ల అంచనాతో మొత్తం 17.116 మీటర్ల సీసీ రోడ్లకు, సైడ్ కాల్వల నిర్మాణానికి రూ.5.23 కోట్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

సర్పంచ్‌ల్లేక నత్తనడకన ఎన్ఆర్ఈజీఎస్ పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఎనిమిది మండలాల్లో చేపట్టిన 90 సీసీ రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్‌లు లేకపోవడంతో పనులకు సంబంధించిన బిల్లులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసిన డబ్బులను సర్పంచ్‌లు డ్రాచేసి కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సి ఉన్నందున పనుల్లో కొంత జాప్యం జరుగుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

మంజూరైన పనులు, పూర్తి చేసిన పనులు

అడవిదేవులపల్లిలో తొమ్మిది పనులు మంజూరుకాగా ఒక పని పూర్తయింది. దామరచర్లలో తొమ్మిది పనులకు రెండు, మాడ్గులపల్లిలో 18 పనులకు నాలుగు, మిర్యాలగూడ 14 పనులకు ఒకటి, వేములపల్లి ఎనిమిది పనులకు మూడు, అనుముల తొమ్మిది పనులకు ఆరు, నిడమనూరు 12 పనులకు రెండు, త్రిపురారం మండలంలో 11 పనులు మంజూరుకాగా ఆరు పనులు పూర్తి చేశారు.

మార్చి 31లోగా పనుల పూర్తికి చర్యలు



రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఎనిమిది మండలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను మార్చి 31లోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి మూడోసారి టెండర్లు పిలిచాం. ఇంకా ఖరారు కాలేదు.

ఎం.వెంకటేశ్వరావు, పంచాయతీరాజ్ ఈఈ, మిర్యాలగూడ.